సాక్షి
విశాఖపట్నం
సోమవారం ॥ 8 ॥ మే ॥ 2023



అలల సంద్రంపై..
మత్స్యకారుల జీవనం విభిన్నం. సముద్రమే జీవనాధారంగా బతికే వీరికి వేట నిషేధ సమయం నిజంగా సవాలే.. 8లో



నీట్‌గా రాశారు
జిల్లాలో నీట్ పరీక్ష ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు ప్రశాంతంగా జరిగింది. 8లో



సొంతింటి కల ప్రాప్తిరస్తు
విశాఖ జిల్లా వ్యాప్తంగా మే 15 నాటికి లక్ష్యంలో 50 శాతం ఇళ్లు పూర్తి చేయడమే సంకల్పంగా నిర్ణయించుకుంది. 10లో

న్యూస్‌రీల్

సింహగిరి ఘాట్‌రోడ్డులో బస్సు బ్రేక్ ఫెయిల్



ఘాట్‌రోడ్డులో నిలిచిన బస్సు

సింహాచలం: సింహగిరి ఘాట్‌రోడ్డులో ఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిల్ అయి వెనక్కి వెళ్లడంతో.. అందులో ప్రయాణిస్తున్న భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. ఆదివారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఆర్టీసీ బస్సు 10 మంది ప్రయాణికులతో కొండపైకి వెళ్తోంది. టోల్‌గేట్ దాటగానే ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ఉన్న ఎగువ భాగంలో మలుపు తిరుగుతుండగా బ్రేక్‌లు ఫెయిల్ అవడంతో కుడి పక్కన ఉన్న కొండను ఢీకొట్టింది. వెనక్కి వెళ్లి.. మెట్ల మార్గానికి, ఘాట్ రోడ్డుకు మధ్యలోని రైలింగ్‌ను ఢీకొని నిలిచింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. రైలింగ్ ఉండటంతో బస్సు నిలిచిందని, లేకపోతే మెట్లమార్గంలోకి దూసుకెళ్లేదని భక్తులు తెలిపారు.

నేడు డయల్ యువర్ మేయర్, స్పందన

డాబాగార్డెన్స్: మేయర్ గొలగాని హరి వెంకట కుమారి సోమవారం తన చాంబర్‌లో డయల్ యువర్ మేయర్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు టోల్ ఫ్రీ నంబర్ 1800 4250 0009 ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే స్పందన కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి పాల్గొంటారు.

జిల్లా చదరంగం జట్ల ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: జిల్లా చదరంగం జట్ల ఎంపిక(చిల్డ్రన్ చెస్ టోర్నీ) పోటీల్లో దేవాన్స్, శ్రావణి, శంశాక్, తేజస్వి సత్తా చాటారు. అండర్-7 బాలుర విభాగంలో దేవాన్స్ సాయి, 9లో శ్రీ అరుష్, 11లో శ్యామ్‌భార్గవ్, 13లో తనీష్, 15లో సుశేన, 17లో శశాంక్ విజేతలుగా నిలిచారు. అండర్-7లో బాలికల విభాగంగా శ్రావణి, 9లో ఆష్విన్, 11లో రుషిత, 13లో బాంధవిక, 15లో శ్రియరాయ్, 17లో తేజస్వి తొలిస్థానాల్లో నిలిచారు. సీతమ్మధారలోని సామాజిక భవన్‌లో ఆల్ విశాఖ చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఈ పోటీలు జరిగాయి.

ఫౌండ్రీ పరిశ్రమలో విస్తృత ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న ముత్తుకుమార్

మురళీనగర్: ఫౌండ్రీ పరిశ్రమలో మెటలర్జీ విద్యార్థులకు విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫౌండ్రీమెన్(ఐఐఎఫ్) సౌత్ రీజియన్ చైర్మన్ ఎస్. ముత్తుకుమార్ చెప్పారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఐఐఎఫ్ స్టూడెంట్ చాప్టర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఐఎఫ్‌లో చేరిన మెటలర్జికల్ విద్యార్థులకు నిపుణులతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఫౌండ్రీ పరిశ్రమల్లో వస్తున్న నూతన సాంకేతిక విధానాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఐఐఎఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఆర్. ఆంజనేయప్రసాద్ మాట్లాడుతూ దేశంలోని ఫౌండ్రీ పరిశ్రమ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. విద్యార్థుల్లో పరిశోధనాత్మక ఆలోచనలు కలిగించడం, సమావేశాల్లో అనర్గళంగా మాట్లాడే నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఐఐఎఫ్ లక్ష్యమన్నారు. కళాశాల మెటలర్జీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ రత్నకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఐఐఎఫ్ ప్రతినిధి వి.ఎస్ కిశోర్ కుమార్, పలు పరిశ్రమల ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆన్‌లైన్‌లో కెరీర్ సెమినార్

మహారాణిపేట: చదువుకున్న యువతకు మార్గనిర్దేశం చేసేందుకు వైజాగ్ క్రిస్టియన్ ఇంటలెక్చువల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఫోరం ఆన్‌లైన్ కెరీర్ సెమినార్ నిర్వహిస్తుంది. ఈ నెల 8వ తేదీ నుంచి రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, రీసెర్చ్ విద్యార్థులు ఈ సెమినార్‌లో పాల్గొనవచ్చు. ఈ ఉచిత గూగుల్ మీట్‌లో పలువురు విద్యావేత్తలు, వైద్యులు, మేధావులు పాల్గొంటారు. ఆసక్తి గల వారు 90305 94055, 94918 27977లో పేర్లు నమోదు చేసుకోవచ్చు.

సర్కారీ బడి మెరిసెన్

- పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలలు
- ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు మించి ఫలితాలు
- 4 పాఠశాలల్లో నూరుశాతం ఉత్తీర్ణత
- 921 మందికి 500కు పైగానే మార్కులు

జిల్లాలో పదోతరగతి ఫలితాలిలా..

పరీక్షలకు హాజరైన వారు	27,447
ఉత్తీర్ణత పొందినవారు	22,692 (82.68 శాతం)
బాలుర ఉత్తీర్ణత	11,507
బాలికల ఉత్తీర్ణత	11,185
ఫస్ట్‌క్లాస్	18,591
సెకండ్ క్లాస్	2,918
థర్డ్‌క్లాస్	1,183

విశాఖ విద్య: ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు సౌకర్యాల లేమితో కునారిల్లేవి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు ప్రవేశపెట్టడంతో సర్కారీ స్కూళ్లు సత్తా చాటుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న నాడు-నేడు పనులతో అమరిన వసతులను అందిపుచ్చుకున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపారు. దీనికి నిదర్శనమే మల్కాపురం ఎంపీఎల్ హైస్కూల్ విద్యార్థి పూడి మణికంఠస్వామి పదో తరగతిలో 592 మార్కులు సాధించి మెరిశారు. ప్రత్యేక శ్రద్ధ చూపడంతో ప్రభుత్వ పాఠశాలలు అత్యుత్తమ ఫలితాలు సాధించాయి.

ప్రభుత్వ స్కూళ్లలోనే టాపర్స్

జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 136 పాఠశాలల నుంచి ఈ ఏడాది 10,747 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 7,198 మంది ఉత్తీర్ణత సాధించారు. పాసైన వారిలో ఏకంగా 4,632 మంది ఫస్ట్‌క్లాస్ సాధించటం విశేషం. అదే విధంగా 921 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. మార్కుల సాధనలో మెరిసిన విద్యార్థులకు అభినందనలు వెల్లువలా వస్తున్నాయి.

ఆ నాల్గింటిలో నూరుశాతం

జిల్లాలోని నాలుగు పాఠశాలల్లో నూరుశాతం ఫలితాలు వచ్చాయి. భీమిలి, పద్మనాభం కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, భీమిలిలోని బాలికల ఏపీ రెసిడెన్షియల్ పాఠశాల, సాగర్‌నగర్‌లోని ప్రభుత్వ అంధుల స్కూల్ నుంచి పరీక్షలు రాసిన విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యారు. మార్కుల సాధనలోనూ ఈ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. కేజీబీవీ విద్యార్థులను, ఫలితాల సాధనకు కృషి చేసిన ప్రిన్సిపాల్స్‌ను జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ప్రత్యేకంగా అభినందించారు.



టాపర్స్‌గా నిలిచిన కేజీబీవీ విద్యార్థులను అభినందిస్తున్న జేసీ విశ్వనాథన్

ప్రభుత్వ స్కూళ్లలో ఉత్తీర్ణత

ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు	136
హాజరైన విద్యార్థులు	10,747
ఉత్తీర్ణులైన వారు	7,198
ఉత్తీర్ణత శాతం	67
ఫస్ట్‌క్లాస్‌లో పాసైనవారు	4,632
500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు	921

నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన స్కూళ్లు

- కస్తూర్బా గాంధీ విద్యాలయం, భీమునిపట్నం
- కస్తూర్బా గాంధీ విద్యాలయం, పద్మనాభం
- ఏపీ రెసిడెన్షియల్ స్కూల్, భీమునిపట్నం
- ప్రభుత్వ వికలాంగుల పాఠశాల, సాగర్‌నగర్

27 ఏళ్లుగా వందశాతం ఉత్తీర్ణత



సాగర్‌నగర్‌లో ప్రభుత్వ అంధుల పాఠశాల

కొమ్మాది: సకల సౌకర్యాలు.. విశాలమైన ప్రాంగణం.. క్రమశిక్షణతో కూడిన విద్య.. ఇవన్నీ విజయానికి సోపానాలుగా మారాయి. అందుకే పదో తరగతి పరీక్షల్లో 27 ఏళ్లుగా శత శాతం ఉత్తీర్ణత సాధిస్తుంది సాగర్‌నగర్‌లోని ప్రభుత్వ అంధ బాలికల పాఠశాల. 1997 నుంచి ఇప్పటివరకు ఈ పాఠశాల నుంచి 238 మంది అంధ బాలికలు ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వంచే ఉచిత వసతి, పౌష్టికాహారం, ఆధునిక బ్రెయిలీ సామగ్రితో విద్య, కంప్యూటర్ పరిజ్ఞానంతో శిక్షణ, ప్రత్యేక విద్యా సదుపాయాలతో ముందుకు సాగుతూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఈ ఏడాది ఈ పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థినులు అరుణ, మణమ్మ, దివ్య, దీప్తి, దేవి, వినలాంబిక పదో తరగతి పరీక్షలు రాయగా ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.

ఆనందంగా ఉంది

27 ఏళ్లుగా మా పాఠశాల శత శాతం ఉత్తీర్ణత సాధించడం ఆనందంగా ఉంది. ఈ ఏడాది ఆరుగురు విద్యార్థినులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించడం గర్వంగా ఉంది. ఇదే స్ఫూర్తితో పాఠశాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం.

– ఎం.మహేశ్వరరెడ్డి, పిన్సిపాల్, అంధుల బాలికల పాఠశాల, సాగర్‌నగర్

చక్కటి ప్రణాళికతోనే..



కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పేద వర్గాలకు చెందిన బాలికలే చదువుకుంటున్నారు. వీరికి విద్యాబుద్ధులు నేర్పించి, ప్రయోజకులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వంద రోజుల ప్రణాళికలను అమలు చేశాం. ఉన్నతాధికారుల సూచనలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు పాఠశాలలను పర్యవేక్షించాం. మెరుగైన ఫలితాలు వచ్చినందుకు సంతోషంగా ఉంది.

– ఖలీషా బేగం, కేజీబీవీల ప్రత్యేకాధికారి

ప్రతీ విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ



పద్మనాభంలో చాలా కాలం పని చేసి, ఇటీవలే భీమునిపట్నంకు బదిలీపై వచ్చాను. పద్మనాభంలో పదేళ్లుగా వరుసగా పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు వచ్చాయి. ఇదే ఒరవడి కొనసాగేలా విద్యాలయంలోని ప్రతి విద్యార్థినిపై వ్యక్తిగత శ్రద్ధ చూపి పరీక్షలకు సన్నద్ధం చేశాం. విద్యార్థులు టాప్ మార్కులు సాధించటం ఆనందంగా ఉంది.

– గంగా కుమారి, ప్రిన్సిపాల్, కేజీబీవీ భీమునిపట్నం



మోద ప్రియాంక (588)



మునూరు తేజశ్రీ (588)



నమ్మి భారతి (588)



బొబ్బిలి జ్యోతి స్వరూప (586)



శీరంరెడ్డి సౌజన్య (586)



కొండ్ర నిహారిక (586)

ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల వారీగా సాధించిన ఫలితాలు

మేనేజ్‌మెంట్	పరీక్ష రాసిన వారు	పాసైన వారు	ఫస్ట్‌క్లాస్	సెకండ్ క్లాస్	థర్డ్ క్లాస్	ఉత్తీర్ణత శాతం
ప్రభుత్వ	698	438	273	120	45	62.75
ఎయిడెడ్	729	519	467	103	49	71.19
ఏపీఆర్‌ఎస్	81	81	80	1	-	100
ఏపీటీడబ్ల్యూఆర్	116	97	73	18	6	83.62
బీసీ వెల్ఫేర్	127	107	61	34	12	84.25
కేజీబీవీ	108	102	89	11	2	94.66
మున్సిపల్	2,118	1,366	850	350	166	64.49
సోషల్ వెల్ఫేర్	208	160	111	29	20	76.92
జెడ్పీ	6,391	4,158	2,545	1,049	564	65.06

శ్రమించి.. ఫలితం సాధించా..



మల్కాపురం: నిరుపేద కుటుంబం మాది. నాపై అమ్మ ఎన్నో ఆశలు పెట్టుకుంది. నన్ను ఐఏఎస్ చేయాలన్నది ఆమె కల. ప్రతి రోజూ ఉదయం 4 గంటలకు నిద్ర లేచి చదువుకునేవాడిని. ఏ సబ్జెక్ట్‌పై సందేహం ఉన్నా.. వెంటనే టీచర్ల ద్వారా తెలుసుకునేవాడిని. శ్రమించి చదవడం వల్లే ఈ రోజు నేను 592 మార్కులు సాధించగలిగాను. మాది విజయనగరం జిల్లా వద్ద పూడివలస. విజయనగరంలో నేను ఐదో తరగతి చదువుతున్నప్పుడే నాన్న నాగరాజు చనిపోయారు. అమ్మ శ్రీదేవి వ్యవసాయ కూలీ. అమ్మ సంపాదన అంతంతమాత్రం కావడంతో తాత భాస్కరరావు నన్ను మల్కాపురం తీసుకువచ్చారు. జీవీఎంసీ పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించారు. ఈ విజయంలో నా శ్రమ ఎంత ఉందో.. ఉపాధ్యాయుల ప్రోత్సాహం అంతకంటే ఎక్కువ ఉంది.

– పూడి మణికంఠ, మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థి

ఆర్థిక ఇబ్బందులే చదివించాయి..



తల్లిదండ్రులతో కల్పన

తగరపువలస: మా నాన్న త్రినాథ్ కారు డ్రైవర్, అమ్మ లక్ష్మి గృహిణి. కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా నేను విజయనగరం జిల్లా వేపాడ మండలం నల్లబిల్లి, జమ్మాదిపేటలోని అమ్మమ్మ ఇంట్లో ఉండి చదువుకుండేదానిని. నాలుగో తరగతిలో ఉండగా అమ్మమ్మ సూర్యనారాయణమ్మ చనిపోయింది. దీంతో నేనే వంట చేసుకుంటూ పాఠశాలకు వెళ్లేదానిని. అప్పట్లో భీమిలిలోని ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో సీటు సంపాదించాలని పట్టుదల ఉండేది. దేవుడి దయ వల్ల నేను కోరుకున్న చోటే సీటు వచ్చింది. ఇప్పుడు 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానంలో నిలిచిన నాకు 591 మార్కులు లభించాయి. ఈ క్రెడిట్ అంతా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకే చెందుతుంది. నా ముందున్న లక్ష్యం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి ఇంజినీరింగ్ పూర్తి చేయడం. క్యాంపస్ సెలక్షన్‌లో ఉద్యోగం సాధించాలి. దానిని ఆసరాగా చేసుకుని ఐపీఎస్ పూర్తి చేసి ప్రజలకు సేవ చేయాలి.

– జామి కల్పన, తరువోలు, చీడికాడ మండలం, అనకాపల్లి జిల్లా



పితాని కేజియా (586)



బోరా తిలక్ (585)



ఈర్ల రేవతి (585)



రఘుమందల హర్షిత (585)

అదరగొట్టిన కస్తూర్బా విద్యార్థినులు

పద్మనాభం: పద్మనాభం కస్తూర్బా విద్యాలయం విద్యార్థినులు అదరగొట్టారు. ఈ విద్యాలయంలో 36 మందికి 36 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 33 మంది ప్రథమ శ్రేణిలోను, ముగ్గురు ద్వితీయ శ్రేణిలో నిలిచారు. ఐదు వందల పైబడి మార్కులు ఎనిమిది మంది సాధించారు.



పేరు: డి.లలిత సాయి
పాఠశాల: జీవీఎంసీ-సీఎంఆర్ ప్రకాశ రావుపేట
మార్కులు: 586
లక్ష్యం: సాఫ్ట్‌వేర్ ఇంజనీర్
కుటుంబ నేపథ్యం: తండ్రి కన్నాజీరావు ప్రైవేట్ ఉద్యోగి. తల్లి గృహిణి.
చదివిన తీరు: ఉపాధ్యాయులు చెప్పే ప్రధానాంశాలు రాసుకునేవాడిని. సందేహాలను స్టడీ అవర్స్‌లో నివృత్తి చేసుకునేవాడిని.



పేరు: ఎ.తారకరామ్
పాఠశాల: మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ బీసీ గురుకుల సంక్షేమ పాఠశాల, సింహాచలం
మార్కులు: 588
లక్ష్యం: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్
కుటుంబ నేపథ్యం: తండ్రి శ్రీను ఫిషర్ మెన్, తల్లి ఉమ గృహిణి
చదివిన తీరు: ప్రణాళికాబద్ధంగా రోజుకు 10 నుంచి 15గంటలు చదివాను. ఉపాధ్యాయులు ఇచ్చే సూచనలు పాటించాను.



పేరు: ఇండిగ తేజస్విని
పాఠశాల: వేపగుంట జిల్లా పరిషత్ హైస్కూల్
మార్కులు: 585
లక్ష్యం: ఐఏఎస్
కుటుంబ నేపథ్యం: తల్లి లక్ష్మి టైలరింగ్ పనులు చేస్తుంటారు. నాయుడుతోటలోని అమ్మమ్మ ఇంట్లో ఉండి తేజస్విని చదువుకుంటోంది.
చదివినతీరు: ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని సొంతంగానే నోట్స్ తయారు చేసుకున్నాను. వాటిని పదే పదే చదివాను.

మార్గదర్శిలో మతలబులెన్నో!

- రామోజీ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి
- చిన్న వ్యాపారులు బతక కూడదన్నది ఆయన నైజం
- 1980 నుంచి మార్గదర్శిలో అవకతవకలు
- డిపాజిట్లు ఎవరికి చెల్లించారో వెల్లడించాలి
- మార్గదర్శి అక్రమాలు–నిజానిజాలు సదస్సులో వక్తలు

సాక్షి, విశాఖపట్నం: మార్గదర్శి లొసుగులపై రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని చర్చలు జరగాలని, చిట్‌ఫండ్స్‌పై జనంలో అవగాహన పెరగాలని వక్తలు అభిప్రాయపడ్డారు. 'రామోజీరావు మార్గదర్శి అక్రమాలు–నిజానిజాలు' అనే అంశంపై ఆదివారం సాయంత్రం నగరంలోని ఓ హోటల్‌లో సదస్సు జరిగింది. స్వర్ణాంధ్ర వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ మందపాటి నాగార్జునరెడ్డి, స్వర్ణాంధ్ర దినపత్రిక ఎడిటర్ కేబీజీ తిలక్, ప్రముఖ న్యాయవాది శర్మ పాల్గొని మాట్లాడారు. చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని రామోజీరావు మార్గదర్శి చిట్‌ఫండ్ పేరిట అక్రమాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. 1980 నుంచి మార్గదర్శిలో అవకతవకలు జరుగుతున్నాయన్నారు. ఇందులో అవకతవకలకు విశాఖలోనే బీజం పడిందన్నారు. మార్గదర్శి డిపాజిట్లు ఎవరెవరికి చెల్లించారో వెల్లడించాలని, మార్గదర్శిలో అక్రమాలు, అవకతవలకు కారకుడైన రామోజీరావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్గదర్శిని అడ్డంపెట్టుకుని అక్రమంగా ఎలా డిపాజిట్లు వసూలు చేశారో, ఎలా అవకవకలకు పాల్పడ్డారో, న్యాయ వ్యవస్థలను ఎలా తప్పుదారి పట్టించారో, తెలుగుదేశం పార్టీ రామోజీకి ఎలా కొమ్ము కాస్తుందో సోదాహరణంగా వివరించారు. ఈ సదస్సుకు నగరానికి చెందిన పలువురు న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు (సీఏలు), ఇతర ప్రముఖులు హాజరయ్యారు. మార్గదర్శి, రామోజీ వ్యవహారాలపై ఉండవల్లి, నాగార్జునరెడ్డి, తిలక్, శర్మల సోదాహరణ ప్రసంగాలకు వీరు హర్షధ్వానాలు పలికారు. కరతాళ ధ్వనులు చేశారు. ఈ సదస్సులో ఎవరేమన్నారంటే..



మార్గదర్శి అక్రమాలు- నిజానిజాలసదస్సుకు హాజరైన ప్రముఖులు

ఇతర ప్రాంతాల్లోనూ చర్చా వేదికలు

మార్గదర్శి అక్రమాలపై రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ చర్చా వేదికలు నిర్వహించాలని యోచిస్తున్నాం. ఇప్పటికే ఇటీవల విజయవాడలో నిర్వహించాం. త్వరలో రాయలసీమలోనూ (తిరుపతి) ఏర్పాటు చేస్తున్నాం. రామోజీరావు మార్గదర్శకత్వంలోనే మార్గదర్శి నడుస్తోంది. మూడు దశాబ్దాలుగా రాష్ట్రంలో పొలిటికల్ మాఫియా రాజ్యమేలుతోంది. దీనికి మీడియా కూడా తోడైంది. ఈ రెండూ చేతులు కలిపితే ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయో ఆంధ్రప్రదేశ్‌లో చూస్తున్నాం. 17 ఏళ్ల క్రితం ఉండవల్లి అరుణ్‌కుమార్ మార్గదర్శి కుంభకోణాన్ని బయటపెట్టారు. మార్గదర్శిపై ఆయన చేస్తున్నది ధర్మ పోరాటం. ఆ పోరాటానికి ప్రజల్లో మద్దతు పెరుగుతోంది. మార్గదర్శిలో పెట్టుబడి పెట్టినవారు, బాధితులు తమ ఆలోచనలను పంచుకోవడానికి ఈ చర్చా వేదికలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఏ వ్యాపారమైనా తానే చేయాలి.. చిన్న వ్యాపారులు బతక కూడదన్నదే రామోజీ నైజం.

– **కేబీజీ తిలక్**, ఎడిటర్, స్వర్ణాంధ్ర దినపత్రిక

ఆ డబ్బులు ఎక్కడెక్కడ పెడుతున్నారు..?

రామోజీకి ఆడిటర్స్‌గా వ్యవహరించిన బ్రహ్మయ్య అండ్ కోలో నేనూ చార్టర్డ్ అకౌంటెంట్‌గా పనిచేశాను. అప్పట్లో ఈనాడు, మార్గదర్శిల్లో ఎన్నో అవకతవకలు, మతలబులు వెలుగు చూశాయి. ఇంపోర్టెడ్ న్యూస్‌ప్రింట్ కొనుగోలులో మేనేజ్ చేయడానికి విశాఖలో ఓ ఉద్యోగిని నియమించారు. చిట్ పాడుకున్నాక ఏళ్ల తరబడి సొమ్ము చెల్లించలేదు. రామోజీ డబ్బులు తెస్తున్నారు.. ఎక్కడెక్కడో పెడుతున్నారు. ఏమవుతుందోనని అప్పటి అన్నదాత ఎడిటర్ కేఎస్ రెడ్డి నాతో అనే వారు. అదే నిజమైంది. వ్యవస్థలో లోపాలను అనుకూలంగా మలచుకోవడం రామోజీకి వెన్నతో పెట్టిన విద్య. 1980 నుంచే మార్గదర్శిలో అక్రమాలు జరుగుతున్నాయి. మార్గదర్శి లొసుగులను, అవకతవకలను బయటపెట్టడానికి సిద్ధంగా ఉన్నాను. నాపై పరువు నష్టం దావా వేసినా, కేసు పెట్టినా వెనకాడను. చంద్రబాబు లేకుండా రామోజీ లేరు. రామోజీ లేకుండా చంద్రబాబు లేరు. ఈనెల 14న హైదరాబాద్‌లో ఉండవల్లితో చర్చకు టీడీపీ అధికార ప్రతినిధి జీవీరెడ్డిని చంద్రబాబు పంపుతున్నారు. మార్గదర్శికి, జీవీరెడ్డికి లింకేమిటి? రామోజీ సీఐడీ విచారణకు మంచంపై పడుకుని హాజరు కావడం ఓ ఎత్తుగడ.

– **మందపాటి నాగార్జునరెడ్డి**, చార్టర్డ్ అకౌంటెంట్

ఇది ధర్మ యుద్ధం..

రామోజీరావు నేతృత్వంలోని మార్గదర్శిపై చేసేది ధర్మ యుద్ధం. మార్గదర్శి డిపాజిటర్లు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది. ప్రభుత్వం ఇప్పుడు ఆ బాధ్యతనే నెరవేరుస్తోంది. మార్గదర్శి ఆర్బీఐ, మరే ఇతర నిబంధనలను పాటించడం లేదు. మార్గదర్శిలో డిపాజిట్లు ఎక్కడున్నాయి? ఎప్పుడు చెల్లింపు జరిపారు? ఎవరికి చెల్లించారు? అవన్నీ రామోజీరావు వెల్లడించాలి. మార్గదర్శిలో అక్రమాలపై డిపాజిటర్ల కోసం కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉంది. అగ్రిగోల్డ్, సహారా సంస్థల మాదిరిగా మార్గదర్శి కూడా మారకుండా ఆపలేమా అన్నది అంతా ఆలోచించాలి.

– **శర్మ**, సీనియర్ న్యాయవాది

సీఎం జగన్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



స్టేడియం వద్ద వైఎస్సార్ విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

దొండపర్తి: బీచ్ రోడ్డులో ప్రారంభానికి సిద్ధమవుతున్న సీ-హారియర్ మ్యూజియం విశాఖకు మరో మణిహారంగా మారుతుందని కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 11న విశాఖలో పర్యటిస్తున్న దృష్ట్యా పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మలతో కలిసి ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు. సీ-హారియర్ యుద్ధ విమాన మ్యూజియం, వైఎస్సార్ క్రికెట్ స్టేడియం, ఆరిలోవ అపోలో ఆస్పత్రి ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో ఏర్పాటు చేసిన సీ-హారియర్ మ్యూజియం విశాఖ వాసులకు, పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని పంచుతుందన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా దీన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. సీపీ త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటవుతున్న సీ-హారియర్ మ్యూజియం పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందన్నారు. అనంతరం వైఎస్సార్ క్రికెట్ స్టేడియం వద్ద ముఖ్యమంత్రి హెలిప్యాడ్ పనులు పరిశీలించారు. స్టేడియం వద్ద ఏర్పాటు చేయనున్న దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించారు. అక్కడి నుంచి ఆరిలోవలో అపోలో క్యాన్సర్ ఆస్పత్రిలో కార్యక్రమ ఏర్పాట్లపై నిర్వాహకులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. భీమిలి ఆర్డీవో భాస్కర్ రెడ్డి, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, ఆర్ అండ్ బీ, పోలీస్, ఫైర్ అధికారులు పాల్గొన్నారు.

స్టీల్ కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలి


మాట్లాడుతున్న తపన్‌సేన్

ఉక్కునగరం: ప్రభుత్వ ఆదేశాలతో స్థానిక స్టీల్ యాజమాన్యం కార్మికుల నూతన వేతనాల అమలుపై చేస్తున్న తప్పుడు ప్రచారాలను తక్షణం ఆపాలని, వెంటనే స్టీల్ కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో వేతన ఒప్పందాలు అన్ని కార్మిక సంఘాల అంగీకారంతో జరగగా ఈసారి మెజార్టీ కార్మిక సంఘాల నిర్ణయాన్ని అంగీకరిస్తున్నామని ఎన్‌జేసీఎస్ యాజమాన్యం చెప్పడం దుర్మార్గమన్నారు. కార్మికులకు నష్టదాయకం కనుక సీఐటీయూ ఆ ఎంఓయూపై సంతకం చేయలేదన్నారు. స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా మాట్లాడుతూ నూతన వేతన ఒప్పందంపై అలుముకున్న నీలి నీడలను కార్మిక వర్గం ఐక్యతతో విచ్ఛిన్నం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబా, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నర్సింగరావు, జిల్లా నాయకులు జగ్గునాయుడు, కె.ఎం. శ్రీనివాస్, 78వ వార్డు కార్పొరేటర్ బి. గంగారావు, జె. అయోధ్యరామ్ పాల్గొన్నారు.

బ్రాండెడ్ దుస్తుల అమ్మకాలకు స్పందన


సందర్శకులతో కిటకిటలాడుతున్న స్టాల్

బీచ్‌రోడ్డు: బ్రాండెడ్ దుస్తులు, షూస్‌పై 80 శాతం వరకు భారీ తగ్గింపుతో బీచ్‌రోడ్డులోని పామ్ బీచ్ హోటల్‌లో జరుగుతున్న అమ్మకాలకు నగర వాసుల నుంచి విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు. మగవారికి, మహిళలకు, పిల్లలకు అవసరమైన యారో, యు.ఎస్.పోలో, రాంగ్లర్, ఫ్లయింగ్ మిషన్, కలర్ ప్లస్, రీబాక్, ఉమెన్స్, రేమాండ్స్ వంటి ప్రముఖ బ్రాండ్ల వేలాది రకాల ఫ్యాషన్ దుస్తులను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ప్రదర్శనలో రూ.250 నుంచి రూ.1,100 ధరలకే విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శన సోమవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కడలే వారికి అమ్మ ఒడి. అలల సవ్వడులు వారికి జోలపాట. సాగరంలో వేటే జీవనంగా సాగుతున్న మత్స్యకారుల జీవనశైలి అంతా విభిన్నం. అనుక్షణం ప్రకృతి విసిరే సవాళ్లను ఎదుర్కొంటూ.. నిత్యం ఆటుపోట్ల మధ్య సాగే వీరి జీవనం ఓ సమరం. ఎగిసిపడే కెరటాలను సంవత్సరంలో 10 నెలలపాటు అవలీలగా దాటి సముద్రంలో చేపల వేట సాగించే వీరికి.. వేట నిషేధ సమయమే విశ్రాంతి. ఆ సమయంలో వీరి జీవనం పెను సవాలే.! ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా సాయం అందిస్తుండడంతో కొంత ఉపశమనం కలుగుతోంది. – విశాఖపట్నం డెస్క్


ఫిషింగ్ హార్బర్‌లో బోటుకు మరమ్మతులు చేసుకుంటున్న మత్స్యకారులు

అలల సంద్రంపై బతుకు విన్యాసం


భీమిలిలో వలలు అల్లుకుంటున్న మత్స్యకారులు

సాగర మథనం.. సాహస జీవనం
- మత్స్యకారుల జీవనం విలక్షణం
- సముద్రమే వీరి జీవనాధారం
- వేట నిషేధ సమయంలో జీవన పోరాటం
- వైఎస్సార్ మత్స్యకార భరోసాతో ఉపశమనం

మత్స్యసంపద పరిరక్షణ కోసం సముద్రంలో వేట నిషేధం అమలవుతోంది. ఏపీ మెరైన్ ఫిషింగ్ రెగ్యులేషన్ యాక్ట్ 1995 ప్రకారం సముద్రంలో చేపల వేటపై పలు ఆదేశాలున్నాయి. ఈ చట్టం 1997 నుంచి అమల్లోకి వచ్చింది. 2007 నుంచి 61 రోజుల పాటు వేట నిషేధం అమలవుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ 15న వేట నిషేధం అమల్లోకి రాగా.. జూన్ 14 వరకు కొనసాగనుంది. తొలి రోజుల్లో వేట నిషేధం అమలుకు అధికారులు పలు చోట్ల కష్టపడాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం సులువుగానే వేట నిషేధం అమలవుతోంది. వేట నిషేధం అనంతరం వస్తున్న ఫలితాలతో పాటు కన్నెర్ర చేసిన సంద్రం రూపు చూసిన మత్స్యకారులు అధికారుల ఆదేశాలను పాటిస్తున్నారు.

మత్స్యకారులు ఏం చేస్తారు?

వేట నిషేధం అమల్లోకి రాగానే ఫిషింగ్ హార్బర్‌కు బోట్లన్నీ చేరుకుంటాయి. ఏప్రిల్ 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకు అప్పటి వరకు వేటాడిన మత్స్య సంపద విక్రయాలు, వలలు భద్రపరచుకోవడం తదితర పనుల్లో మత్స్యకారులు నిమగ్నమవుతారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన మత్స్యకారులు వారి స్వగ్రామాలకు వెళ్లిపోతారు. సొంత పనులు చేసుకోవడంతో పాటు ఆలయాలను సందర్శించడం, గ్రామాల్లో దేవత సంబరాలు జరుపుకోవడం తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారు. జూన్ 1 నుంచి మళ్లీ ఫిషింగ్ హార్బర్‌కు చేరుకొని వేటకు సమాయత్తమవుతారు. బోటు, వలలను సిద్ధం చేసుకుంటారు. కొందరు మత్స్యకారులు వలలు మరమ్మతులు చేసుకోవడం, అవకాశం ఉన్న వారు నగరంలో భవన నిర్మాణ పనులు, పెయింటింగ్ పనులకు వెళ్తుంటారు. కొందరు తెప్పల్లో మత్స్యవేట సాగిస్తుంటారు. భీమిలి నియోజకవర్గంలోని మత్స్యకారులు సమీపంలోని గోస్తనీలో వేట సాగిస్తుంటారు. ఆయా పనులు దొరకని పక్షంలో ఏదోలా కాలక్షేపం చేస్తుంటారు.

జిల్లాలో తీర ప్రాంతం	24 కి.మీ
మత్స్యకార గ్రామాలు	15
ఫిష్ లాండింగ్ కేంద్రాలు	30
జిల్లాలో మర పడవలు	687
ఫైబర్ బోట్లు	1272
తెప్పలు	428

బోసిపోయిన ఫిషింగ్ హార్బర్

వేట నిషేధంతో ఫిషింగ్ హార్బర్ బోసిపోయింది. ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోయాయి. వినియోగదారులు ఇటువైపు రావడం మానేశారు. తెప్పలపై వేట చేసి తెచ్చిన కొద్ది పాటి చేపలను కొంత మంది మహిళలు ఇక్కడ విక్రయిస్తున్నారు. ఎండేసిన నెత్తళ్లు, రొయ్యలు విక్రయాలు కూడా అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. ఎండుచేపలను కూడా కేరళ తదితర ప్రాంతాలను దిగుమతి చేసుకుంటామని మత్స్యకార మహిళలు చెబుతున్నారు. వీధుల్లో చేపలు విక్రయించే మత్స్యకార మహిళలు.. వేట నిషేధ కాలంలో చెరువు చేపల అమ్మకం చేపడుతున్నారు. లేనివారు ఇతరాత్ర పనులకు వెళ్తున్నారు.


ఫిషింగ్ హార్బర్‌లో ఎండు చేపలను సిద్ధం చేస్తున్న మహిళ

మత్స్యకారులకు భరోసా

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. మత్స్యకారుల జీవితాల్లో చాలా మార్పు వచ్చింది. వేట విరామం సమయంలో గత ప్రభుత్వాలు అరకొర మందికి.. అదీ ఏడాదికి రూ.4 వేల ఆర్థిక సాయం, 20 కిలోల బియ్యం ఇచ్చి చేతులు దులుపుకునేవి. అయితే ప్రస్తుత ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తోంది. వేట బోట్లకు డీజిల్ సబ్సిడీని గణనీయంగా పెంచింది. ప్రస్తుతం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకంలో లబ్ధిదారుల ఎంపికకు సర్వే జరుగుతోంది.

వేసవిలోనే నిషేధం ఎందుకు?

వేట నిషేధం సరే.. మరి రెండు నెలలు ఎందుకు? అదీ వేసవిలో ఎందుకు అమలు చేస్తున్నారు? అనే ప్రశ్న అందరిలోనూ ఉత్పన్నమవుతుంది. ఒకప్పుడు బంగాళాఖాతంలో విలువైన జీవరాశులుండేవి. రానురానూ వాటి సంపద తగ్గిపోతోంది. ముఖ్యంగా వేసవిలో గుడ్లు పెట్టే దశలో వేట కారణంగా సంతానోత్పత్తి పడిపోతోంది. ఈ కాలంలో ట్రాల్ ఫిషింగ్ వల్ల సముద్రంలో బెడ్ నాగలితో దున్నినట్లు అయిపోతోంది. దీని వల్ల పునరుత్పత్తికి ఆటంకం ఏర్పడి.. అరుదైన జాతులు కూడా కనుమరుగవుతున్నాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకు సముద్రంలో చేపల గుడ్లు పెట్టేందుకు అనువైన వాతావరణం ఉంటుంది. గుడ్లు పిల్లలుగా మారి వేగంగా ఎదిగేందుకు ఈ ఉష్ణోగ్రత దోహదపడుతుంది. పైగా సముద్రంలో బెడ్‌ను ఆటంకం కలిగించకపోవడంతో చేపలకు ఆహారమైన ప్లవకాలు(జూ ప్లాంక్టన్, ఫైథో ప్లాంక్టన్) వృద్ధి చెందుతాయి. ఇలా చేపల వేట నిషేధం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. బంగాళాఖాతం తీర ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలలోనూ చేపల వేట నిషేధం అమలు చేస్తున్నారు. అందుకే నిషేధిత కాలంలో సముద్రంలో వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు సూచిస్తున్నట్లు మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ జి.విజయ తెలిపారు.

వైఎస్సార్ మత్స్యకార భరోసా అమలు ఇలా...

జిల్లా	సంవత్సరం	లబ్ధిదారులు	జీవన భృతి(రూ.లో.)
విశాఖ	2022	11,334	11,33,40,000
ఉమ్మడి విశాఖ	2021	22,366	22,36,60,000
ఉమ్మడి విశాఖ	2020	20,273	20,27,30,000
ఉమ్మడి విశాఖ	2019	18,925	18,92,50,000

విరామ సమయంలో ఇబ్బందులే..



చేపల వేట తప్పించి.. మరో వృత్తి తెలియదు. నిషేధ సమయంలో ఇళ్ల వద్దే ఉంటాం. ఈ రెండు నెలలు జీవనానికి ఇబ్బందులు ఎదురైనా.. మత్స్యసంపద పరిరక్షణకు ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తాం. నాలుగేళ్లుగా వైఎస్సార్ మత్స్యకార భరోసా అందుతోంది. ఈ ఏడాది కూడా ఈ పథకానికి దరఖాస్తు చేశాను.
– వాసుపల్లి లక్ష్మయ్య, మత్స్యకారుడు

వ్యాపారం అంతంతమాత్రమే..



సాధారణ రోజుల్లో ఫిషింగ్ హార్బర్‌కు ఎక్కువ మంది కొనుగోలుదారులు వస్తారు. తాజా చేపలతో పాటు ఎండు చేపల వ్యాపారం బాగుంటుంది. ప్రస్తుతం వేట నిషేధం అమలులో ఉండటంతో వ్యాపారం అంతంతమాత్రంగానే ఉంది. ఫిషింగ్ హార్బర్ చూడటానికి వచ్చే వారిలో ఎవరైనా ఎండు చేపలు కొంటారు. ప్రస్తుతం ఎండు నెత్తళ్లను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. మిగిలిన ఎండు చేపలు ఇక్కడివే..
– సూరాడ తానియమ్మ, ఎండు చేపల వ్యాపారి

చేపల ఉత్పత్తికి అనువైన వాతావరణం



వేసవిలో చేపల సంతానోత్పత్తికి అనువైన వాతావరణం ఉంటుంది. వేట విరామం తర్వాత చేపలు దండిగా పడతాయి. దసరా వరకు చేపల వేట ఆశాజనకంగా సాగుతుంది. వేట నిషేధ కాలంలో కలాసీలు వాళ్ల ఊళ్లకు వెళ్లిపోతారు. బోటు యజమానులంతా బోటుకు అవసరమైన మరమ్మతులు చేపడుతుంటారు. ప్రస్తుతం ధరలు మండిపోతున్నాయి. ప్రభుత్వం వేట విరామ సమయంలో అందించే జీవనభృతి మొత్తం మరింత పెంచితే బాగుంటుంది.
– చింతపల్లి వీర్రాజు, అధ్యక్షుడు, విశాఖ డాల్ఫిన్స్ బోటు ఆపరేటర్ల అసోసియేషన్

‘నీట్’గా రాశారు

- జిల్లాలో ప్రశాంతంగా నీట్
- 98.33 శాతం హాజరు

ఆరిలోవ(విశాఖ తూర్పు): జిల్లాలో నీట్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు ఈ పరీక్ష జరిగింది. నగరంలో 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. విద్యార్థులు ఉదయం 11 గంటల నుంచి చేరుకున్నారు. అన్ని కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించారు. నిబంధనల ప్రకారం నిషేధించిన వస్తువులను పరీక్ష హాల్‌లోకి తీసుకెళ్లకుండా విద్యార్థులను తనిఖీ చేశారు. జిల్లాలో 7,978 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేయగా.. 7,845 మంది(98.33 శాతం) విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 133 మంది గైర్హాజరైనట్లు డీఆర్వో శ్రీనివాసమూర్తి తెలిపారు.


బెస్ట్ ఆఫ్ లక్..



విద్యార్థుల ఆభరణాలు, ఇతర వస్తువులను తీసివేస్తున్న సిబ్బంది, తల్లి


గాయంతో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థి


పరీక్ష కేంద్రం వద్ద ప్రిపేర్ అవుతున్న విద్యార్థిని


హాల్‌టికెట్‌ను తనిఖీ చేస్తున్న సిబ్బంది

నాలుగు కరోనా కేసులు

మహారాణిపేట: జిల్లాలో ఆదివారం నాలుగు కరోనా కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 203 మందికి పరీక్షలు నిర్వహించగా.. నలుగురికి కరోనా నిర్ధారణ అయింది. దీంతో మొత్తం కరోనా సోకిన వారి సంఖ్య 198 చేరింది. ముగ్గురు డిశ్చార్జ్ అయ్యారు. 17 మంది హోం ఐసోలేషన్‌లో, ఇద్దరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

చార్జీ ఇవ్వలేదని బస్సులోనుంచి తోసేశారు

- వీడిన మధురవాడ యువకుడి మృతి మిస్టరీ
- ప్రైవేటు బస్సు డ్రైవర్, క్లీనర్ అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆదాం

లావేరు : ఇటీవల శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం బుడుమూరు వద్ద జాతీయ రహదారిపై అనుమానాస్పద స్థితిలో లభ్యమైన యువకుడి మృతదేహానికి సంబంధించిన మిస్టరీ వీడింది. చార్జీ ఇవ్వలేదని బస్సులో నుంచి ప్రయాణికుడిని డ్రైవర్, క్లీనర్‌లు తోసేయడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇందుకు బాధ్యులైన ప్రైవేటు బస్సు(గంగోత్రి) డ్రైవర్ వెలమశెట్టి రామకృష్ణ, క్లీనర్ బొమ్మాళి అప్పన్నలను ఆదివారం జేఆర్‌పురం సీఐ ఎస్.ఆదాం అరెస్టు చేశారు. అనంతరం లావేరు పోలీస్ స్టేషన్‌లో విలేకర్లకు వివరాలు వెల్లడించారు. మధురవాడకు చెందిన గేదేల భరత్‌కుమార్ ఈ నెల 2న రాత్రి తన స్నేహితులు వెంకటేష్, శివతో కలిసి శ్రీకాకుళం వచ్చాడు. 3వ తేదీ వేకువజామున 3.30 గంటల సమయంలో తాను మధురవాడ వెళ్లిపోతానని బస్సు ఎక్కించాలని స్నేహితులకు చెప్పడంతో వారు విశాఖపట్నం వెళుతున్న గంగోత్రి అనే ప్రైవేటు బస్సును ఎక్కించారు. ఆ సమయంలో స్నేహితులు బస్సు చార్జీ ఫోన్‌పే చేస్తామని క్లీనర్‌కు చెప్పారు. బస్సు ఎచ్చెర్ల మండలం చిలకపాలెం వచ్చినా ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించకపోవడంతో క్లీనర్ భరత్‌కుమార్‌ను చార్జీ డబ్బులు ఇవ్వమని అడిగాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. లావేరు మండలం బుడుమూరు వద్దకు వచ్చేసరికి డ్రైవర్ వెలమశెట్టి రామకృష్ణకు విషయం చెప్పగా బస్సు నుంచి తోసేయమని చెప్పాడు. దీంతో బస్సు వెళుతుండగానే భరత్‌కుమార్‌ను క్లీనర్ బయటకు తోసేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. తొలుత పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యులు మృతిపై అనుమానాలు వ్యక్తం చేయడంతో ఆ దిశలో దర్యాప్తు చేయగా ఈ విషయం బయటపడింది. సీసీ ఫుటేజ్ ఆధారంగా గంగోత్రి బస్సుగా గుర్తించి ఆ రోజు డ్యూటీలో ఉన్న డ్రైవర్ రామకృష్ణ, క్లీనర్ అప్పన్నలను అదుపులోకి తీసుకొని విచారించారు. చార్జీ డబ్బుల కోసం జరిగిన గొడవలో భరత్‌కుమార్‌ను బస్సులోని నుంచి బయటకు తోసేశామని డ్రైవర్, క్లీనర్ నేరం అంగీకరించారని సీఐ అన్నారు.

పోరాటయోధుడు అల్లూరి


అల్లూరికి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ హరివెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులు

బీచ్‌రోడ్డు: సాయుధ పోరాట యోధుడు, తెల్లదొరల వెన్నులో వణుకు పుట్టించిన అల్లూరి సీతారామరాజు నేటి తరానికి ఆదర్శనీయుడని మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా బీచ్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి మేయర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అల్లూరి చిన్న వయసులో ప్రాణాలు కోల్పోవడం దేశానికి ఎప్పటికీ తీరని లోటన్నారు. అల్లూరి పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఏజెన్సీ ప్రాంతాలను కలుపుకుని అల్లూరి సీతారామరాజు జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డిప్యూటీ మేయర్లు శ్రీధర్, కటుమూరి సతీష్, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, కార్పొరేటర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

బీచ్‌రోడ్డులోని అల్లూరి విగ్రహానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరోచిత పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు సేవలను గుర్తించడానికి చాలా సమయం పట్టిందన్నారు. జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఎ.విమల తదితరులు పాల్గొన్నారు.